క్లుప్తంగా

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం

కొమరోలు: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం తెలిపారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యాజమాన్య కమిటీ ఎన్నికల నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎంఈవో వెంకటరత్నం మాట్లాడుతూ ఈనెల 8 వ తేదీ 7 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఆరోజే సభ్యుల ఎన్నిక, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, ప్రమాణ స్వీకారం నిర్వహించాలని తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


డీఎల్‌పీఓను అభినందిస్తున్న ఈఓపీఆర్డీ మోహన్‌రెడ్డి, కార్యదర్శులు

మార్కాపురం: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీఓ భాగ్యవతి సూచించారు. శుక్రవారం ఈఓపీఆర్డీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు నూతన డీఎల్‌పీఓను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్యదర్శులకు సూచించారు.

వాహన నిబంధనలు పాటించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

కొనకనమిట్ల: జాతీయ రహదారిపై కొనకనమిట్ల సమీపంలో శుక్రవారం సాయంత్రం ఎస్సై మాధవరావు తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో ప్రజలకు శాంతి భద్రతలు, నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సజ్జ, కంది పంటల పరిశీలన


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని మాదాల వారిపాలెంలో రైతులు సాగు చేసిన సజ్జ, కంది పంటలను వ్యవసాయాధికారులు శుక్రవారం సందర్శించారు. దర్శి ఏడీఏ బాలాజీ నాయక్ రైతులకు పలు సూచనలు చేశారు. కంది పంటలో వైరస్ తెగులు రాకుండా 40-50 రోజుల వ్యవధిలో సల్ఫర్ పిచికారీ చేయాలన్నారు. ఎండు తెగులు నివారణకు, గూడు పురుగు ఉధృతిని తగ్గించేందుకు వేపనూనె కషాయాలు వాడాలని చెప్పారు. వ్యవసాయాధికారి షేక్ జైనులాబ్దిన్ మాట్లాడుతూ.. పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ సుమన్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు


పుట్టినరోజు కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ మురళీకృష్ణ

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీపీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, పార్టీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, యూత్ నాయకులు టంగుటూరి వెంకట్రావుయాదవ్, కోటపాటి బ్రహ్మారెడ్డి, ఎంఆర్ఎఫ్ వెంకటేశ్వరరెడ్డి, సీసీకేఆర్ శ్రీనివాసరెడ్డి, పులిగొర్ల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల సందడి

- నియోజకవర్గంలో 325 పాఠశాలల్లో ఎన్నికలు


పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్‌ను అంటిస్తున్న ఎంఈఓ

కంభం:

ప్రభుత్వం ఎస్ఎంసీ ఎన్నికలకు ఆగస్టు ఒకటో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాఠశాలల్లో ఎన్నికల సందడి మొదలైంది. నోటిఫికేషన్ కాపీలను గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నోటీసు బోర్డుల్లో అంటించారు. ఎన్నికల నోటిఫికేషన్‌లో భాగంగా 1వ తేదీ నోటిఫికేషన్ విడుదలతో పాటు మధ్యాహ్నం ఓటర్ల జాబితా ప్రకటించారు. 5వ తేదీ ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల లోపు తుది జాబితా సిద్ధం చేసి ప్రకటించాలి. ఆగస్టు 8వ తేదీన ఉదయ 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ప్రత్యక్ష పద్ధతిలో చేతులు ఎత్తడం ద్వారా ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికైన సభ్యులు ఎస్ఎంసీ చైర్మన్‌ను, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రమాణ స్వీకారం నిర్వహించాలి. సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల మధ్యలో కొత్త కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది.

నియోజకవర్గంలో 325 పాఠశాలలు:
నియోజకవర్గంలో దాదాపు 325 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ఎన్నికైన సభ్యులతో పాటు ప్రధానోపాధ్యాయుడు లేదా ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్, మున్సిపల్ చైర్‌పర్సన్, మేయర్ వారి ప్రాంతంలో ఎప్పుడైనా ఎస్ఎంసీ సమావేశాలకు వారి ఇష్టప్రకారం హాజరు కావచ్చు.

> **ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేశాం**
> ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నాం. అవసరమైన చోట పోలీసు బందోబస్తు కోరుతాం.
> – మాల్యాద్రి, యంఈఓ, కంభం

ఎన్నికల విధానం:
- పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్నికల నిర్వహణకు తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించాలి. కనీసం 50 శాతం మంది తల్లిదండ్రుల హాజరు తప్పనిసరి.
- తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ పిల్లలు ఎన్ని తరగతుల్లో ఉంటే అన్ని తరగతుల్లో ఎన్నిక విధానంలో పాల్గొనవచ్చు. కానీ సభ్యులను ఎన్నుకొనేందుకు ఓటు వేసే అవకాశం ఒక్కరికే ఉంటుంది.
- సాధారణంగా చేతులు ఎత్తే ప్రక్రియ లేదా చెప్పడం ద్వారా ఎన్నిక నిర్వహించాలి. అసాధారణ పరిస్థితుల్లో బ్యాలట్ పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహించాలి.

మార్గదర్శకాలు:
- పాఠశాల యాజమాన్య కమిటీలు ప్రాథమిక పాఠశాలల్లో మండల విద్యాశాఖాధికారులు, ఇతర పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖాధికారి అధికారికంగా రద్దుపరిచినట్లుగా ప్రకటించే వరకు నిరంతరం నిర్వహిస్తారు.
- ఎన్నికైన సభ్యుడి పదవీ కాలం రెండు సంవత్సరాలు
- ఒక వేళ ఆ సభ్యుడి కుమారుడు లేదా కుమార్తె ఆ పాఠశాల నుంచి వెళ్లిపోతే ఆ సభ్యుడి పదవీ కాలం అంతటితో ముగుస్తుంది. ఆ స్థానం భర్తీ చేసేందుకు ప్రారంభ తరగతిలో లేదా ఖాళీ ఏర్పడిన తరగతిలో ఆ తరగతి పిల్లల తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నుకుంటారు.

గిద్దలూరు నియోజకవర్గంలో ఎన్నికలు జరిగే పాఠశాలలు మండలాల వారీగా

కంభం	44
అర్థవీడు	45
బేస్తవారిపేట	56
కొమరోలు	55
రాచర్ల	46
గిద్దలూరు	79

ప్రత్యామ్నాయ పంటలు మేలు


ఖాజీపురంలో సాగులో ఉన్న మొక్కజొన్న


అక్కపల్లెలో సాగులో ఉన్న కొర్ర

- తగ్గిన సంప్రదాయ పంటల సాగు విస్తీర్ణం
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల అడుగులు
- గిద్దలూరు నియోజకవర్గంలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం

బేస్తవారిపేట: ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టిపెడుతున్నారు. రెండు నెలలుగా ఆకాశం మేఘావృతం అవుతున్నా సరైన వర్షాలు పడటంలేదు. రైతన్నలు వర్షం కోసం ఆశగా ఎదురు చూస్తున్నా వారికి నిరాశే ఎదురవుతోంది. అరకొరగా పడిన వర్షాలకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో సంప్రదాయ పంటల సాగుపై రైతులు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. జూన్‌లోనే రాగి, మొక్కజొన్న, పత్తి పంటలను బోర్ల కింద సాగు చేశారు. ఇప్పటికి మొక్కజొన్న, రాగి పంటలు వేస్తుండటంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

గత ప్రభుత్వం ప్రోత్సాహం:
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగి, పత్తి, మొక్కజొన్న, అపరాలు పంటల సాగును ప్రోత్సహించింది. పంట సాగుపై రైతులు ఆసక్తి పెంచుకునేలా అవగాహన కల్పించింది. రైతులు పండించిన పంటలకు గత ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టింది.


పొగాకు ఎక్కువ సాగయ్యే అవకాశం:
నియోజకవర్గంలో పొగాకు ఎక్కువ మొత్తంలో సాగయ్యే అవకాశం కనిపిస్తోంది. గత ఏడాదిలో కంది, పత్తి పంట 1853 హెక్టార్లలో సాగైంది. ఈ పంటల స్థానంలో పొగాకు వైపునకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది 4 వేల హెక్టార్లలో పొగాకు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

నియోజకవర్గంలో పంటల సాగు వివరాలు

పంట పేరు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
సజ్జలు	833
మొక్కజొన్న	697
కొర్ర	1275
కంది	1086
మినుము	77
నువ్వులు	676
ఆముదం	272
పత్తి	679
పెసర	41

> **రైతులకు అవగాహన కల్పిస్తున్నాం**
> ప్రత్యామ్నాయ పంటల ద్వారా మంచి దిగుబడులు సాధిస్తూ, తక్కువ ఖర్చుతో ఆదాయం పొందవచ్చని అన్నీ మండలాల్లోని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోంది. పంటలకు తెగుళ్లు సోకకుండా క్షేత్ర స్థాయిలో పంటలు పరిశీలించి సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు ఇస్తున్నాం.
> – డీ బాలాజీనాయక్, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, గిద్దలూరు

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి


మెమొంటోలు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ హెచ్ఎం రామ్‌భూపాల్‌రెడ్డి

అర్థవీడు (బేస్తవారిపేట): విద్యార్థి దశలో కష్టపడి చదువుకోవడంతో మంచి భవిష్యత్ ఉంటుందని రిటైర్డ్ హెచ్ఎం రామ్‌భూపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాలలో శుక్రవారం పదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరంలో ప్రతిభ చూపిన విద్యార్థులు మెమెంటోలు, ప్రశంస పత్రాలు పంపిణీ చేశారు. ఒక లక్ష్యాన్ని పెట్టుకుని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. హెచ్ఎం వై మాలతి మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న రిటైర్డ్ హెచ్ఎం రామ్‌భూపాల్‌రెడ్డి సేవలు అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యం వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎం చాంద్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మిత్ర పురుగులతో పంటకు రక్షణ

బేస్తవారిపేట: పంటలో మిత్ర పురుగులను సంరక్షించడంతో పంట దిగుబడి పెరడంతో లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ అన్నారు. మండలంలోని పూసలపాడులో పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పంటలు వేయడానికి ముందు మట్టి పరీక్ష చేయడంతో ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. పొలంలో తీసిన మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపాలని, వచ్చిన ఫలితాలను బట్టి రసాయన మందులు ఉపయోగించాలని సూచించారు. కంది విత్తడానికి ముందు ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ నవీన్, రైతులు పాల్గొన్నారు.


పొలంబడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మెర్సీ

ఆటో, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు


ఆటో ముందు భాగంలో ఇరుక్కున్న బైక్

మార్కాపురం: ఆటోను బైక్ ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన శుక్రవారం పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని కళాశాల రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దరిమడుగు గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి తన బైక్‌పై మార్కాపురం వస్తూ కళాశాల రోడ్డు వైపు వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలించారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించండి

- ఏడీఏ బాలాజీనాయక్


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్, ఏఓ శ్రీనివాసులు

మార్కాపురం రూరల్: పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ బాలాజీ నాయక్ సూచించారు. శుక్రవారం జమ్మనపల్లి, కోలభీమునిపాడు గ్రామాల్లో పత్తి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. పత్తిలో పచ్చదోమ, పేనుబంక దీని నివారణకు ఎసిఫేట్ 300 గ్రాములు, ఎసిటామిప్రైడ్ లేదా థైయోమిథాక్సమ్ 80 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి 10 రోజులకు మందును మార్చి పిచికారీ చేయాలని సూచించారు. పత్తిలో కలుపు, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. పెంకు పురుగుల నివారణకు క్లోరోపైరిఫాస్ 250 మి.లీ ఎకరానికి వాడాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, కోలభీమునిపాడు వీఏఏ సంధ్య, మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో వ్యాధినిరోధక శక్తి


తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బేస్తవారిపేట: ప్రసవం జరిగిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాపడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీ గాలెమ్మ అన్నారు. మండలంలోని చెరుకుపల్లెలో తల్లిపాల వారోత్సవం శుక్రవారం నిర్వహించారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలను పట్టించాలని, తల్లిపాలు బిడ్డకు దేవుడిచ్చిన వరమన్నారు. పాలివ్వడంతో బ్రెస్ట్ క్యాన్సర్ కాకుండా రక్షణ పొందవచ్చని తెలిపారు. తల్లులు, గర్భిణీలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సీహెచ్ విజయలక్ష్మీ, ఐ కవిత, సీహెచ్ మేరి, ఎం రూతమ్మ, డీ ఖాశింబి పాల్గొన్నారు.


అంగన్‌వాడీలో చిన్నారుల బరువు చూస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తల్లి పాలు బిడ్డకు అమృతం
మార్కాపురం టౌన్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితా సలోమి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని రాయవరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకాగా భావించాలని చెప్పారు. తల్లిపాలపై అపోహలు విడిచిపెట్టాలని సూచించారు. అనంతరం పిల్లల బరువు, ఎత్తు చూసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలను వివరించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


తర్లుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడు ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు సీడీపీఓ సుశీలాదేవి అవగాహన కల్పించారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి, సీహెచ్ఓ తులసీప్రసాద్, ఏఎన్ఎంలు రాధ, నాగేశ్వరమ్మ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శాకంబరిగా జగదాంబ మాత


పొదిలిలో శాకంబరిగా వాసవీమాత


శాకంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగదాంబమాత

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వర జగదాంబమాత ఆలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వరుణ్ తేజ, సాయి అమ్మవారికి ఉదయం అభిషేకాలు, అర్చనతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పొదిలి: ఆషాఢ మాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని వాసవి సేవా భక్త బృందం సభ్యులు ఇంటింటి నుంచి తెచ్చిన కూరగాయలతో అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు.

కొనకనమిట్ల ఎస్సీ కాలనీల్లో దాహం కేకలు

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్ల ఎస్సీ కాలనీలకు గత 15 రోజులుగా సాగర్ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటి కోసం కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు సాగర్ నీరు సరఫరా కాక, మరోవైపు బోర్లు కూడా పనిచేయకపోవడంతో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. కనీసం వాడుక నీటికి కూడా ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు ఎస్సీ కాలనీల్లో 450 ఇళ్లు ఉన్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సక్రమంగా మంచి నీరు అందించాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం


కొనకనమిట్లలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొనకనమిట్ల: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక గుజ్జుల యలమందారెడ్డి స్మారక భవనంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు యద్దనపూడి చినవిలియమ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా విలియమ్ మాట్లాడుతూ.. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి తగిన గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు, రాజు, మంచికల చినకోటేశ్వరరావు, నిశనం డేవిడ్, గొంగటి కరుణయ్య, విజయ్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: మాదిగ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం పొదిలిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బాప్టిస్ట్‌పాలెం నుంచి చిన్న బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారంగా ఏర్పడ్డారు. ఏబీఎం పాఠశాల వద్ద అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల నెహేమియా, ఐజక్, మండల శాఖ అధ్యక్షుడు పందిటి రవీంద్రబాబు, ప్రజా సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల ఉప వర్గీకరణ కోటా రాజ్యాంగబద్ధమే

గిద్దలూరు రూరల్: ఎస్సీ, ఎస్టీల ఉప వర్గీకరణ కోటా రాజ్యాంగ బద్ధమేనని ఆయా వర్గాల్లో అత్యంత వెనుకబడిన ఉపవర్గాల వారికి రాష్ట్ర స్థాయి కోటాలో ప్రత్యేక కోటా కేటాయించవచ్చు అని ధర్మాసనం గురువారం తీర్పు హర్షించదగ్గ విషయమని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నియోజక వర్గం కన్వీనర్ పెరికే మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పంట మార్పిడితోనే దిగుబడులు

రాచర్ల: పంట మార్పిడితోనే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్ అన్నారు. మండలంలోని అనుములపల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, కొర్ర పంట పొలాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటను ప్రతి రెండు నుంచి మూడు సంవత్సరాలకు ఒకసారి జొన్న, సజ్జ పంటలాంటి మార్పిడి చేయాలని రైతులకు వివరించారు. ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చే పురుగులు ఉన్నాయని గుర్తించారు. రసం పీల్చే పురుగుల నివారణ ముందుగా 5 శాతం వేపగింజల కషాయం లేదా వేపనూనె 5 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. అధిక మోతాదులో నత్రజని ఎరువులను వాడకూడదన్నారు. పంట విత్తిన 30, 45 రోజుల తరువాత కాండపై పూత మోనోక్రోటోఫాస్, నీరు 1.4 నిష్పత్తిలో, 60 రోజుల తరువాత ఇమిడాక్లోరోఫిడ్ 1.20 నిష్పత్తి మొక్క లేత కాండానికి బ్రష్‌తో పూస్తే రసం పీల్చే పురుగులను అదుపులో ఉంచుతుందని రైతులకు వివరించారు. పసుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 20 చొప్పున పొలంలో అమర్చడం ద్వారా పురుగు ఉధృతిని నివారించుకోవచ్చాన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బి.సంపత్‌కుమార్, అనుములపల్లె రైతు భరోసా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ రమణ పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలు పంపిణీ

మార్కాపురం రూరల్: జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గజ్జలకొండ పీహెచ్‌సీలో ఫ్లోరోసిస్ బాధితులకు లంబార్డ్, నెక్ బెల్టులు, వాకింగ్ స్టిక్స్‌ను జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అనీల్‌కుమార్ పంపిణీ చేశారు. గజ్జలకొండ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సాయిచరణ్‌తేజ మాట్లాడుతూ.. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా పరికరాలు అందించామన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ బి.శ్రీకాంత్, సూపర్‌వైజర్లు పి.పెద్దన్న, టి.విమల, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.